# వెనకచూపు - ముందునడక

రచనకు పూనుకున్న స్త్రీలు రెండు అపరాధాలు చేస్తారు. పుస్తకాల సంఖ్య పెంచడం, స్త్రీలసంఖ్య తగ్గించడం. కొంత లోకజ్ఞానం, అనుభవం, ఊహ, తార్కికశక్తి- యివీ రచనకు కావల్సిన పరికరాలు. ఇవన్నీ స్త్రీలకి లేకపోలేదు. మానసికంగా, భౌతికంగా మనకంటె తక్కువగా కనబడేవారిపట్ల ఆదరాభిమానాలు, సానుభూతి చూపగలం. మనకంటే అధికులైనవారిపట్ల అసూయచూపడం సహజం. అందుచేత మానసికంగా సమానులైన స్త్రీపురుషుల మధ్య ఆకర్షణ సన్నగిల్లుతుంది. పురుషుల ఆకర్షణ, మెప్పు సంపాదించడంకోసం యిన్నాళ్ళు స్త్రీలు అబలలుగా, అమాయకులుగా నటిస్తూ, ఆరాధించబడుతూ, శీలానికి, సహనానికీ, ఏకాగ్రతకీ పేరుబడ్డారు. ఈ లక్షణాలు పురుషుడు అన్వేషించే ఆదర్శంగా ప్రపంచ చరిత్రలో స్థిరపడినాయి.

రచనద్వారా కొందరు పురుషులు తమ అధిక్యతని ప్రకటించుకుంటూ వచ్చారు ఈ రంగంలో స్త్రీలు పోటీపడితే, పురుషుడు హర్షించడు అని తెలుసుకుని స్త్రీలు రచనకి పూనుకోవడం లేదనుకుంటాను. రచయిత్రి అనగానే పురుషుకికి వేళాకోళంగా వుంటోంది. రచయిత్రిని మెచ్చుకోడంలో కూడా తమ అధిక్యతని ప్రకటించుకుంటున్నారు మొగాళ్లు.

అందుకనే నేను రచనకి పూనుకోలేదు. మావారికి చదివే అలవాటు లేదు. వారు ఏ యే సమయంలో ఏ యే ఆలోచనలు సాగించేదీ నాకు తెలుసు. కాని తెలియనట్లు కనబడతారు. వారూ అంతే. నా ఆలోచనలన్నీ వారికి బాగా తెలుసు. కాని తెలీనట్లు కనబడతారు. మా అన్యోన్యానికి యిదొక కారణం అనుకుంటూ. వివాహం నెగ్గాలంటె యీ రకం నటన కొంతఅవసరమేమో! విడివిడిగా పుట్టాం, విడివిడిగా వెళ్ళిపోతాం. అవతలవారి వ్యక్తిత్వాన్ని కుతూహలంతో కెలికి, మడ్డిచేసి పిల్ల అలల్ని

లేవదీసి దూరంగా వున్న ఆ రాతిమీద వాటి తలలు పగులకొట్టుకుని గాయపడేటట్లు చెయ్యడం ఎందుకు? మళ్ళా ఆ గాయాలకి స్త్రీలే కట్లు కట్టాలి!

అంతమాత్రంచేత వ్యక్తిగతమైన అనుభవాలు లేవనికాదు. మరొకరితో- ముఖ్యంగా పురుషులతో- పంచుకోడానికి వీల్లేని అనుభవాలుంటాయి. అలాగే పురుషులకీను. ఇప్పుడలాంటి వొకనుభవం గురించి చెప్తాను.

మావారి తాలూకు ఒకతనికి పెండ్లి సంబంధం వచ్చింది. పిల్లను చూడ్డానికి మావారు నన్ను వెళ్ళమన్నారు. ఆ ఉదయం ఎక్స్‌ప్రెస్‌లో బెజవాడ ప్రయాణం. సెంట్రల్‌స్టేషన్‌కి వచ్చేటప్పటికి ఎనిమిదైంది. ఫస్టు క్లాస్‌లో ప్రయాణం చేసే హోదావున్నా, స్వంత పనులమీద వెళ్ళినప్పుడల్లా మేం సెకండ్‌క్లాసులో వెళ్ళడం మామూలు. ఫస్టుక్లాస్‌లో వ్యక్తులు వుద్యోగరీత్యా పెద్దలైనా, పిన్నలైనా రైలుపెట్టెలోకి ఎక్కగానే అదొకలాగైపోతారు. ఎవరితోనూ మాట్లాడరు. ఏదో చదువుకుంటూ, దీర్ఘంగా ఆలోచిస్తూ లైట్లు, ఫ్యాన్లు, కిటికీల విషయంలో తమ హక్కులు కాపాడుకుంటూ డాబుగా ప్రవర్తిస్తారు. అది చూసి అవతలవారు కూడా మరింత డాబుగా వ్యవహరిస్తారు. సెకండ్‌క్లాసులో బోలెడంత కాలక్షేపం. ఇందులో ప్రయాణం చేసేవారు కాస్తంత సంస్కారం గల మధ్యతరగతివారు. వారి సంభాషణలు వింటూంటే లోకంపోకడ, వ్యక్తుల వింత మనస్తత్వాలు తెలుస్తాయి. కాలక్షేపం అవుతుంది. మూడోతరగతి మరీ గందరగోళంగా వుంటుంది! ఉమ్ములు, చిరుతిండ్లు, తిట్లు, తుమ్ములు, దగ్గులు- పచ్చి పచ్చిగా అర్థం తెచ్చుకోని ఒత్తిడి జీవితానికి నకలు. రెండో తరగతిలో ప్రపంచానికి కళకి చిహ్నమైన లయ, క్రమం వున్నాయి. ప్రజాస్వామ్య సిద్ధాంతం రెండో తరగతిలో వ్యక్తమైనట్లు మరెక్కడా కాదేమో!

మా నౌకరు రాయన్న సరంజామాతో మా పెట్టెదగ్గరలో వున్న మూడో తరగతిలో సర్దుకున్నాడు. ఓ అమ్మాయిని కూడా ఆ పెట్టెలో కెక్కించాడు. పిల్లాడినెత్తుకున్న ఆమెని సరిగ్గా చూడలేదు.

"మా చెల్లెలండి- తెనా లెడుతూంది." నాకు నవ్వొచ్చింది. రాయన్న కూడా యీ ప్రయాణం పేరిట స్వంతపనులు చూసుకుంటున్నాడు. మావారూ, నేనూ రెండోతరగతి పెట్టెలో ఎక్కాం. పెట్టెనిండా జనం వున్నా, వారిలో చాలామంది వీడ్కోలివ్వడానికి వచ్చినవారే కనక, కొందరు లేచి నాకు జాగా చూపారు. హోల్డాల్ సగం విప్పి మావారు కూర్చో మన్నారు. మావారికి వ్యవసాయశాఖలో పెద్ద ఉద్యోగం, ఆయనతోబాటు కొందరు స్నేహితులూ, ఉద్యోగులు స్టేషన్ కొచ్చారు. ప్లాట్‌ఫారంమీద నిలబడి మాట్లాడుకుంటున్నారు. ఇంతలో గార్డ్ విజిల్ వేశాడు. కలకలం బైలుదేరింది. తెచ్చిపెట్టుకుని దోక్కున్నట్లు ఇంజన్ కూసింది.

"ఎల్లుండి ఉదయం మెయిల్‌కి రాయన్నని పంపు- నాకక్కడ పని తగిలింది. ఇద్దరం కలిసేవద్దాం" అన్నారు మావారు. రైలు కదిలింది. కాళ్ళు, చేతులు, భుజాలరాపిడి, తలుపులు వేయడం, అత్తరు పరిమళం, బొగ్గువాసన, చేతిరూమాళ్ళు వూపడం, కిటికీలనుంచి సగంసగం కనబడే వ్యక్తులు, దూరమైపోతున్న ప్లాట్‌ఫారం, పరిచయమైన ప్రపంచంతో సంబంధం తెగినట్లు, పట్టాలు మార్చిన కుదుపు, పాతవూహల్ని, జ్ఞాపకాలని చెదరకొట్టే రైలువాడి- యివన్నీ నన్ను ఏకాంతమైన వూహాప్రపంచం లోకి చేర్చాయి.

రైలు నడిచే క్రమానికి మన ఆలోచనలు, భావాలు, వాంఛలు ఒక క్రమాన్ని పొందుతాయి. వ్యక్తిత్వానికి ఒక ఆకృతి ఏర్పడుతుంది. మన మెవరమో, మనస్సులో చీకటి గుహలు, వాటిల్లో మన శీలంవేసిన కాగడా, అద్యంతాలు- అన్నీ అద్దంలో చూసుకున్నట్లు పిస్ఫుటమౌతాయి. ఆ కదలికలో నిజస్వరూపం బైటపడుతుంది. దాన్ని మెచ్చుకోలేం, తిట్టలేం. ఆశ్చర్యంతో స్తంభించిపోతాం. ఈ స్థితి నిద్రలోకి దాటుతుంది.

రైలు నిలిచింది. ముందుకు వొంగి చూశా. ఇంకా సిగ్నలివ్వలేదు. ఏవో మరమ్మత్తులు జరుగుతున్నాయి. పనిచేస్తున్న కూలీల కండలమీది చెమటని సూర్యరశ్మి వెలిగిస్తోంది. వారి శరీరాలు రైలుపట్టాల ముక్కలు.

[ 6 ]

ఆ మధ్య మావారెందులోనో ఒక వ్యాసం చదివారు. ప్రపంచంలో ఇనుమంతా తరిగిపోతోందిట. మరో లోహం కనుక్కుంటే తప్ప పారిశ్రామిక యుగానికి భవిష్యత్తు లేదట. ఆనాడు యీ కూలీల శరీరాల మీదనే రైలు ప్రయాణం కాబోలు! అట్లాంటి శరీరాలు వారివి. వారి శ్రేయస్సుకోసమే ప్రభుత్వాల కృషి. కాయకష్టంతో నిమిత్తంలేక నాజూకుతో నీరసించిన మనలాంటి శరీరాలు అందరూ పెంచుకున్ననాడు, రైళ్ళెలా వెడతాయో నేనూహించలేను.

రైలు కదిలింది. పెట్టెలో జనంకేసి ఒక్కసారి చూశాను. రెండు కాళ్ళు కిటికీ కానించి వొంగి పడున్న పిల్లాడిని మినహాయించి పదముగ్గు రున్నారు. ముగ్గురు పైన పడున్నారు. నలుగురు కూర్చునే నిద్రపోతు న్నారు. ఎదురుగుండా ఓ బట్టతలాయన పత్రిక చదువుకుంటున్నాడు. కళ్ళ జోడు నడివయస్కుడు. సినిమాపత్రిక చదువుతున్నాడు. మరో యిద్దరు లాల్చీ వ్యక్తులు మెల్లగా మాట్లాడుకుంటున్నారు. కిటికీలోంచి మాటిమాటికి వుస్తూ ఓ ముసలాయన చుట్టకాలుస్తూ కూర్చున్నాడు. ఆయన పక్కన ఒకామె నాకేసి చూస్తూ, నే చూసినప్పుడు చూపు తప్పించివేస్తూ, చేతి గాజులు సవరించుకుంటూ, గాలికి రేగుతున్న ముంగురులను వెనక్కితోస్తూ కాలక్షేపన చేస్తూవుంది. జుట్టుకి నూనిదట్టంగా పట్టించింది. కాని ముందు భాగం, పాపిడ యిరువెంపులా వున్న ముంగురులకు నూనెరాయాలే దను కుంటా. అవి బూడిదరంగు వెంట్రుకలు వంకరలుతిరిగి, పడుతూలేస్తూ అవి ఆ మొహానికి కొంతఆకర్షణ ఆపాదించాయనుకొంటాను. పల్చటి పెదవులు, వరసతప్పిన ఒక పన్ను, చామనఛాయ, పాతికలోపు, కళాశాల విద్యార్థినేమో నాకు తెలియదు.

ఆ వ్యక్తులవేషం, మాట, తెరువునిబట్టి ఎవరెవరు ఏయే వృత్తులతో ఉండివుంటారో వూహించుకొనడం తమాషాగా వుంటుంది. రైలు నిలిచింది ఊహ నిలిచిపోయింది. గూడూరు జనం దిగడం, ఎక్కడం, బెడ్డింగులు, పెట్టెలు, సంచుల గిరవాట్లు, సామాన్లతో దిగుతున్న కూలీలవాసన— కాసేపు మళ్ళా ఎరుగున్న ప్రపంచంలో కాలుపెట్టినట్లయింది. నా కేమన్నా కావాలేమో కనుక్కునేటందుకు వచ్చాడు రాయన్న. ఏమీ అక్కర్లేద

న్నాను. నే కూర్చున్న వెంపుకు ప్లాట్ఫారం దూరం. దోవలో మొగాళ్ళు నిలబడి వున్నారు. స్టేషన్లోవున్న వ్యక్తులు కనబడడంలేదు. రాయన్న మొహాన్నికూడా కిటికీలోంచీ, తలలమధ్యనుంచీ కాస్తంత చూడగలిగా. పైనున్న ముగ్గురు దిగి వెళ్ళారు. బట్టతలాయన కళ్ళజోడు తీసి అదిపెట్టే పెట్టెకోసం వెదకడం మొదలెట్టాడు. జేబులుచూశాడు, పెట్టెలకిందా, పైనా సీటుకిందా చూశాడు. పేపరుకింద చూశాడు ఎక్కడా లేదు.

నాకు నవ్వొచ్చింది.

"మీరు లేవండి" అన్నాను.

ఆయన లేచాడు. అక్కడేవుంది కండ్లజోడు కేస్. ఆయన నవ్వుకొని జోడు అందులో పెట్టుకొని, అటూ యిటూ చూస్తున్నాడు. నే అనుకున్నట్లుగానే ఆయన రిటైరైన కాలేజీ ప్రిన్సిపాలట. పేరు అవధాని గారు అల్లుడి దగ్గరికి నాగపూర్ వెడుతున్నారట. మావార్ని ఎరుగుదురట. ఆయన రిటైరై ఇల్లుకట్టుకొని తోట వేసుకున్నారట. ఆ తోట విషయంలో మావారు మంచి సలహాలిచ్చారట.

"మిమ్మల్ని చూడలేదు. నేను తిరిగొచ్చింతర్వాత మీరిద్దరూ మా యింటికొచ్చి, మా తోట చూడాలి. ఈమారు మా అమ్మాయినికూడా తీసుకొస్తాను" అన్నారాయన. కూతురు, అల్లుడు, వారి వుద్యోగం, నాగపూర్లో ఆంధ్రులు- అలా మాట్లాడుతూ వున్నారు. ఇంతలో రైలు కదిలింది. జనం కొత్త స్థలాలలో సర్దుకుంటున్నారు. ఇద్దరు ముగ్గురు కొత్త వ్యక్తులున్నారు. వారిలో ఒకాయన మూలగా జరిగి కూర్చున్నాడు. కాకీలాగు, లోపల బెల్టుతో బిగించిన చొక్కా మెడచుట్టూ 'స్కార్ఫ్', పక్కన వున్న లెదర్బాగ్ వున్నాయి. చేతికి రిస్టువాచీ వుంది. కిటికీలో రెండుచేతులూ వాల్చి వాటిమీద గడ్డం ఆనించుకొని బైటకి చూస్తూ కూర్చున్నాడు. ముప్పై లోపువయస్సు. సన్నటినడుం, తీర్చిన కనుబొమ్మలు, నున్నటినుదురు, చెక్కిళ్ళు, మధ్యపాపిడి, వుంగరాలజుట్టు, నున్నగాచేసుకున్న గడ్డం గుర్తు, లేత ఆకుపచ్చగా మెరుస్తోంది, ఆ పెట్టెలో వున్నవారిలో కళైన మొహం- నిదానంగా చూస్తే ఆకర్షణీయంగా కనబడ్డాడు. పెండ్లయిందా? అవకుండా వుంటుందా?

"మీకు పిల్లలా.... ?"

అదిరిపడ్డాను. అవధానిగారు మళ్ళా ప్రశ్నించారు. లేరని చెప్పాను. చాలామంది మొహాలు నావెంపు తిరిగాయి. నాకు సిగ్గేసింది. కిటికీలోంచి జారిపోతున్న పొలాలని, చెట్లని, గట్లని చూస్తూ కూర్చున్నాను. అవధానిగారు తన కూతురు విషయం చెప్పడం సాగించాడు. చాలాకాలం ఆమెకు పిల్లలు కలగలేదట. ఆపరేషన్ చేయించారట.

అవధానిగారి సంభాషణలో ఒక విశేషం వుంది. అదొక స్వగతం లాంటిది. మనమేమీ ప్రశ్నలు వేయనక్కరలేదు. వింటూన్నట్లు ఆయనకేమీ నిదర్శనా లక్కరలేదు. మన స్వంత ఆలోచనలు భంగంలేకుండా సాగించు కోవచ్చు.

కదలికలో ఆలోచనలు, భావాలు వికాసం చెందుతాయెందుకో ? ఎన్నాళ్ళో అర్థంకానివి అర్థమవసాగుతాయి. కొన్ని సందేహాలుకూడా తేలిపోతాయి. "నిన్న సాయంత్రం సభకు ఆహ్వానించింది రాజయ్యా, ఆయన భార్యా ?" అని మావారు, ఏడాదిక్రితం అడిగిన ప్రశ్నలో ప్రాశస్త్యం యిప్పుడు బోధపడింది. బేసిక్‌స్కూలు విద్యార్థుల తోటపెంపకం పోటీ బహుమతులు యివ్వవలసిందిగా, ఉన్నతోద్యోగి రాజయ్య నన్ను ఆహ్వానించాడు. అదంతా అయిన వారంరోజులకి మావారు యీ ప్రశ్న అడిగారు. ఎవరాహ్వానిస్తే నేం ?

కారణం యిప్పుడు తెలిసింది పిలవడానికి రాజయ్య భార్య మా యింటికి వచ్చివుంటే, మావార్ని చూడ్డానికి వచ్చిందని వారికి స్ఫురించి వుండునేమో ! నాకు తెలియని ప్రేమకలాపాలు వారి కేమీలేవు అని అను కుంటున్నాను. అయినా నలభయ్యోపడిలోపడిన నడివయస్కులు స్త్రీలచే ఆకర్షింపబడే అనుభవం వదులుకోరనుకుంటా. ఈ అభిప్రాయాన్ని పురుషుబు ఖండిస్తే, స్త్రీహృదయం ఎంత రహస్యమైనదో, పురుషుడి హృదయమూ అంత రహస్యమైనదే నన్న నిర్వచనానికి ఆక్షేపణ వుండ నక్కర్లేదు.

"మీరే కాలేజీలో చదువుకున్నారు ?" అవధానిగారి ప్రశ్నకి ఆశ్చర్యపడాను. నేను కాలేజీలో చదివిన విషయం ఆయన కెట్లా తెలుసు ?

నా ప్రక్కనున్న ఇంగ్లీషు పత్రికనుబట్టా ? ఫలానా అని చెప్పాను. పెట్టెలో వ్యక్తులందరూ నా వెంపు చూశారు, ఒక్క ఆ మూలనున్న వ్యక్తితప్ప. అతనిప్రక్కన వున్న బాగ్‌మీద టి.కె. అని అక్షరాలున్నాయి. 'కె' అంటే కుటుంబరావనుకొని. ఆ పేరుతో వ్యవహరిస్తాను.

"జ్ఞాపకం వచ్చింది. ఏదో మాటల్లో మీ విషయం వచ్చింది. చరిత్రలో మొదటి తరగతిలో ప్యాసైనారట మీఫాదరన్నారు" నేనేమీ అనలేదు.

"ఏమిటో ఈ రోజుల్లో స్త్రీలు పెద్ద చదువులు చదువుతున్నారన్న మాటేగాని, ఎందుకూ ఉపయోగపడడం లేదుస్మాండి. అందుకనే మా అమ్మాయిని చదువుమాన్పించి, పెండ్లిచేసేశాను. పెద్దచదువులు చదివి ఎదిగిన పిల్లలకి మనం పెండ్లిండ్లు చేయలేం. వారంతవారే ఎవర్నో ఎన్నుకోవాలి. చదువుకున్న స్త్రీలకి ఎందువల్లనో యీ రోజుల్లో వివాహాలు కావడంలేదు. ప్రేమించి చేసుకున్నా పెళ్ళిళ్ళు నెగ్గుతున్నాయంటారా ?"

నాకు సమాధానం చెప్పాలనుంది కోపాన్నుండి బైలుదేరిన సమాధానం అందుకనే చెప్పలేదు.

"నెగ్గడమంటే ?" అన్నాడు లాల్చీవ్యక్తి.

"విడాకులిచ్చుకోకపోవడం అని వారభిప్రాయం" అన్నాడు చుట్ట కాలుస్తున్న పెద్దాయన.

"ఏమండీ—అంతేనా ?" అని నాకేసి చూశాడు.

"లోలోన కుళ్ళి కలిసుండడం బదులు విడిపోవడం మంచిది కాదంటారా ?" అన్నాను.

"మరి పిల్లలేమవుతారు ?" అన్నారు అవధానిగారు.

"ఎవరు పోషించగలిగితే వారితో వుంటారు. పోషించే శక్తి యిద్దరికీ లేకపోతే ప్రభుత్వం భరించాలి."

"పూర్వకాలం పెండ్లిండ్ల కంటె యీ చదువుకొని ప్రేమించుకున్న పెండ్లిండ్లే మంచివంటారు ?" అన్నాడు ముసలాయన. ఆ ప్రశ్నల్లో వెటకారం వుందని నాకు తెలుసు. నా సమాధానం కూడా అలానే వుంటుంది ఎంత స్థిమితంగా చెప్పినా.

"చదువుకున్నవాళ్ళేగాని, చదువురానివాళ్ళు ప్రేమించుకోలేరని నే ననను. ఓ విధంగా వారిలోనే ఉద్రేకాలు తీవ్రంగా ఉంటాయను కుంటాను. చదువు, నాగరికత ఉద్రేకాన్ని చంపుతాయి. ఎటొచ్చీ ఏదో విధంగా జీవించడం ఒకటీ, మనం కోరినట్టుగా అందంగా, ఆనందంగా, కొన్ని ఆదర్శాలను సాధించామన్న జిజ్ఞాసతో జీవించడం మరొకటి. ప్రేమ వివాహంలో నైతికచింతనకి తావుంది. దాంపత్యం కొనసాగకపోతే యితరులను నిందించేటందుకు వీల్లేదు. ఎవరి కార్యాలకి వారు బాధ్యులవు తారు. ఈ బాధ్యత అన్యోన్యాన్ని పెంచుతుందికాని, కూలదొయ్యదు.

నేనిలా మాట్లాడుతుంటే నా కంఠం నాకే వింతగా ధ్వనిస్తోంది. నా ధైర్యానికి ఆశ్చర్యపడ్డాను. భావాలు, పదాలు నాకు కొత్తవి కావు. ఎన్నోమార్లు స్నేహితులతో జరిపిన చర్చలలో వాడకంవల్ల అలవాటైనవే. అందరి చూపులూ నామీద పడినవి. చుట్టూ చీకటి- మధ్య వెలుగు. ఆ వెలుగులో వేదికపైన నేను, తరతరాలుగా మూగజీవులైన ఎందరో స్త్రీల వ్యక్తిత్వాలు నాలో క్షణం ఆకృతిపొంది వాదానికి పురిగొల్పాయి. మావారు వుండివుంటే యిలా అనగలనా ? అంటే యితరులుండగా మావారు కూడా వున్నప్పుడన్నమాట. 'వయస్సులో చాలా చిన్నవారైనా అనుభవం చాలా గడించారు' అన్నారు అవధానిగారు. అది నన్ను సంతృప్తిపరచడం కోసం అన్నమాట. ఇతరులు మనం చిన్నవాళ్ళలాగా కనబడుతున్నా మన్నప్పుడు, మనం పెద్ద వాళ్ళమైపోతున్నామని తెలుసుకోవచ్చుననుకుంటా.

"దీనికి అనుభవం దేనికండీ ? మీబోటి పెద్దలు అంటున్నమాటలే" అనేశాను. ఇంతలో రైలాగింది. జనం భోజనాలకి కాబోలు దిగుతున్నారు. కొత్తగా ఒకలావాటామె ఎక్కింది. రాయన్న కారియర్‌లో భోజనం తీసు కొచ్చాడు. తిని, అంతా శుభ్రంచేసుకుని పక్కపరిచి ఓరగిలిపడుకున్నాను.

నాకో విషయం కుతూహలాన్ని రెచ్చగొట్టింది. మా సంభాషణ బిగ్గరగా సాగుతోంది. అందరూ నాకేసి చూశారు. ఒక్క ఆ మూలనున్న వ్యక్తి కుటుంబరావు తప్ప.

భోజనంచేసి, తాంబూలం వేసుకుని పెదవులు ఎర్రబడుచుకుంటూ, కుటుంబరావు పెట్టెలోకెక్కి మూలనున్న తనస్థానంలో కూర్చుని, మళ్ళా

బైటికి, శూన్యంలోకి చూస్తున్నాడు. లోపలి జనంలో ఒక్కరికేసీ చూడ లేదు. నేనంటే పల్చగా ఏదో మూలగా ఒదిగి వరున్నాను. ప్రక్కన లావాటామెను చూడొచ్చుగా. అంధుడా? ఒక్కడు వెళ్ళి భోజనం చేసి వచ్చాడే! అటూయిటూ పడకుండా, కళ్ళు, రెప్పలు, మూసుకుంటూ, తెరచుకుంటూ, చైనాబొమ్మలా, అంగవైకల్యం కనబడదు.

యౌవనంలో అనుభవం కోసం తహతహలాడటం సహజ మంటారు పెద్దలు. అతను యువకుడు, కొత్త వ్యక్తులను కలుసుకోవాలనీ, వారితో మాట్లాడాలనీ వుండాలి. పరిసరాలని అవగాహన చేసుకోవాలనీ, కొత్త విషయాలను గ్రహించాలనీ వుండాలి. స్త్రీలపట్ల ఎంత కుతూహలం కనబరచాలి! నేనంత సేపు మాట్లాడానే, ఎవరీవ్యక్తి? అన్న కుతూహలం చూపడే! నేను చాలా చక్కనిదాన్ని గనక నన్నంతా చూసి మెచ్చుకోవాలి అనడంలేదు. యౌవనం, యౌవనాన్ని పిలుస్తుందంటారు. అవధానిగారు నేను చిన్నదాన్నని అభినందించారు. ముఖ్యంగా స్త్రీని, స్త్రీ వునికిని గుర్తించకపోవడం స్త్రీజాతిపట్ల అపచారం. చరిత్రలో రాకొమరితలు, వారి పరిచారికలు 'ఇంతేనా మీ కాలంలో! శృంగారమే లేదా? స్త్రీ, పురుష ఆకర్షణ లేదా? ఆ తేడాలేలేవా? ఇంతేనా...." అని చేసిన విషాదగానం నా చెవులో వినబడుతోంది.

కనురెప్పలు సన్నగా విప్పి అతనివైపు కోపంగా చూశాను. ఎల్లోరాలో శిథిలశిల్పాలకేసి నెత్తికొట్టుకోడంలాగుంది. ఆ శిల్పాలలో పురుష విగ్రహాలు ఎంత నిండైనవి, ఎంత అందమైనవి, ఈనాడు ఆ శిల్పులు లేరు. అట్లాంటి వస్తువూ లేదు. సుందరమైన స్త్రీల ప్రేమాదరణలు లేకపోతే ఆ అనామకులైన శిల్పులు అంతటి అందమైన విగ్రహాలను చెక్కివుందురా!

అతనిలో జీవితంపట్ల తృష్ణ సున్న. శరీరంలో కొన్ని ద్రావకాలు లోపించివుంటాయి. అలాంటి వారికి వాంఛలుండవు. అది ఆధ్యాత్మిక చిహ్నం అంటే నమ్మను. మహాఋషులు సాధించిన ఆధ్యాత్మికానుభూతి వెనక నైతికబలం, దీక్ష, నిబ్బరం వుంటాయి. శక్తులున్నవారికే నిగ్రహం సాధ్యం.

ఇతను యోగేమిటి ? నా తలకాయ ! సాధారణవ్యక్తి, జ్ఞానహీనుడు, అల్పుడు. లాటరీలో వచ్చిన గడియారం ప్రదర్శిస్తున్నాడు. దానికేసి చూసే అవసరం లేదతనికి.

కుర్రాడు ఏదో తింటూ, బంతి ఆడించుకుంటూ వచ్చి కూర్చున్నాడు. రబ్బరుబంతి, దానికో రబ్బరు తాడు. వేళ్ళల్లో తాటిని బిగించి బంతిని దూరంగా విడిచి దగ్గరకు లాక్కుంటున్నాడు. తాడు తెగి బంతి అవతల వైపు కుటుంబరావు కాళ్లకింద పడింది. కుర్రాడు వెదుకుతున్నాడు.

"అక్కడ- ఆ మూల కూర్చున్నాయన కాళ్లకింద" అని కుర్రాడికి అటుకేసి చూపించాను. కుర్రాడు అటువెళ్ళి వంగాడు. ఆ వ్యక్తి కాళ్ళు పైకి తీసుకున్నాడు ఎవ్వరికేసి చూడకుండా. కుర్రాడు బంతి తీసుకొచ్చాడు.

నాకు ఒళ్ళుమండింది. నా మాట విన్నాడు. ఇటుకేసి చూడొచ్చుగా. గర్వమా ? ఈ అల్పుడితో నాకేమిటని కళ్ళుమూసుకుని పడున్నాను.

రైలు కదిలింది. రాయన్న మొహం కిటికీలోంచి కనబడి వెనక్కి కదిలింది. మధ్యాహ్నపుయెండ నా నుదిటి మీదికి జారింది. దుమ్ము, బొగ్గు కణాలు ఎండలో కదులుతూ, చిరాకు కలిగిస్తున్నాయి. చీరకొంగు జుట్టు మీదనించి బిగించి నుదుటిమీద కప్పుకున్నాను. పెట్టెలో అలజడి లేదు. కొందరు జోగుతున్నారు. కొందరు శూన్యంలోకి చూస్తున్నారు. కుర్రాడు మాత్రం బంతిని టపీటపీ నేలమీద కొడుతున్నాడు. కుటుంబరావు సిగరెట్టు కాలుస్తున్నాడు. అవతలకి చూస్తూ చౌకరకం సిగరెట్టు. కళ్ళు మూసు కున్నాను. జ్ఞాపకాలు రైలు కదలిక లయిలో కలసిపోయాయి. ఎంత సేపయిందో తెలీదు. నిద్రపోయానేమో !

రైలు ఒక్క కుదుపుతో నిలిచింది. లావాటామె నా మీద పడింది. లేచికూర్చున్నాను. కుర్రాడు నవ్వుతున్నాడు. కుదుపుకి అవధానిగారు కూడా లేచాడు. సామాను సర్దుకుంటున్నాడు.

"ఇంకా స్టేషన్ రాలేదు తొందర వాళ్లేదు" అన్నాను.

"కళ్లజోడు కేస్ కనిపించడంలేదు" అన్నాడు అవధానిగారు.

"కథలలో చెప్పుతునే మతిమరుపు అయ్యవారిలా వుందండోయ్ మీ కథ" అన్నాను. ఆయన నవ్వాడు.

"మరి నేను అయ్యవార్నేగా! ఇంతకీ జోడు...."

"మీ కళ్లకి తగిలించి లేదులెండి. ఒక్కసారి లేవండి."

లేచాడు. దుప్పటికింద వుంది.

"ఏమిటబ్బా గుచ్చుకుంటోందీ అని గంటనించి ఆలోచిస్తున్నా-తాళంచెవా? పర్సా? పొడుంకాయా?" నవ్వుకున్నాడు.

"ఒక ప్రొఫెసర్‌గారు పరీక్ష చేయించుకోడానికి డాక్టర్ దగ్గరికి వెళ్ళాడుట. నాలిక చాచమన్నాడుట డాక్టర్. చాచాడుట. దానిమీద రెండణాల స్టాంప్ అంటుకుని వుందట. "ఇక్కడుందా స్టాంప్? ప్రొద్దున్న నుండి వెదుకుతున్నా" అన్నాడట.

పెట్టెలో జనం నవ్వారు. మూలనున్న కుటుంబరావు తప్ప.

ఇంతలో ముసలాయన చుట్ట నోట్లో పెట్టి, అగ్గిపెట్టి తీసిచూశాడు. పుల్లలు లేవు. అటూయిటూ చూశాడు. ఎవ్వరూ అగ్గిపుల్ల యిచ్చినవారు లేరు. నేను మూలనున్న కుటుంబరావుకేసి చూపించాను.

"ఏవండి! అగ్గిపుల్ల యివ్వగలరా?" అన్నాడు ముసలాయన కుటుంబరావు భుజం తడుతూ. అతను పంట్లాం జేబులోంచి తీసిచ్చాడు, యిటుకేసి చూడకుండానే. నా కర్థం కాలేదు యీ వింత ప్రవర్తన. మూసున్న స్థలాలంటే భయమా? మావారు చెబుతూండేవారు- ఒకాయనకి మూసున్న స్థలాలంటే భయమట. తలుపులు మూసేసిన గదిలో కూర్చో లేడట. అదో మానసిక జాడ్యంట.

"కుర్రాడిని నాతో తీసుకురావల్సింది. యీ వెదుక్కోటం తప్పేది. అందుకనే మన పూర్వీకులు పిల్లలో అని యిదయ్యేది" అన్నాడు అవధాని గారు.

ఇంతలో లావాటామె అందుకుంది. ఆవిడ పేరు శేషమ్మట. తమ్ముడు పోలీసు సూపరెంటట. ఆమె భర్తకి పొగాకు వ్యాపారంట.

"ఎందుకొచ్చిన పిల్లలులెద్దురూ? ఆడపిల్లలైతే పెళ్ళిళ్ళ కోసం

తిరుగుళ్ళాట, మొగపిల్లలైతే చదువులు, వుద్యోగాల కోసం దేవుళ్ళాట. పిల్లలు లేకుంటేనే స్వేచ్ఛ" అన్నది శేషమ్మ.

"ఇంకా నయం. అందరూ యీ స్వేచ్ఛ కోరితే దేశమేంగాను? అసలు సమాజమే వుండదు ఏమంటారు?" అన్నాడు అవధానిగారు నన్ను సంబోధించి.

"మరిచిపోయాను. మీకు సంతానం లేదు గనక, శేషమ్మగారి స్వేచ్ఛే నయమంటారు, అవునా?"

"నేనల్లాగనను. పోషించలేని వారికి పిల్లలుండకూడదంటాను. ఆర్థిక పరిస్థితినిబట్టి, కుటుంబం నిర్ణీతమవ్వాలి. అందుకనే కుటుంబపథకం అంటూ తయారుచేసి ప్రచారం చేస్తోంది ప్రభుత్వం. మన ప్రజలు మూఢాచారాలకు గురై అందులోని సూత్రాలని ఆమోదించినా, ఆచరణలో మాత్రం పెట్టరు" అన్నాను.

నాకీ విషయం ప్రస్తావించాలని లేదు. ఎందుకో ఆ క్షణంలో ధైర్యమొచ్చింది. పిల్లలులేని స్థితిని సమర్థించుకోవడమా? మనస్సు చిత్రమైనది. మన ప్రవర్తన నమ్మకాలను సమర్థించేటందుకు ఎన్నో కారణాలను వెదికి పెడుతుంది. అయినా అవధానిగారు పెద్దాయన. తత్వాన్ని గూర్చి చర్చగాని, వ్యక్తిగతమైన వివాదం కాదుగా. కుటుంబ పథకం గూర్చి ఒక స్త్రీ మాట్లాడుతోందంటే, పురుషులు విస్తుపోవాలి. కుటుంబరావు యిటుకేసి చూడడేం? కుతూహలం కనబరచడేం?

"అయితే, సంతాన నిరోధం ప్రకృతి విరుద్ధం కాదంటారా?" అని మళ్ళా ప్రశ్నించాడు అవధానిగారు.

"మన నాగరికత, మన వేషభాషలు, ఆచారాలు, కట్టుబాట్లు, యివన్నీ ప్రకృతి విరుద్ధం కాదంటారా?" అన్నాను.

"మా బాగా అడిగావమ్మా! గంపెడు పిల్లలతో వెయ్యేళ్ళు వర్ధిల్లు" అంది శేషమ్మ.

గంపలో పిల్లల్ని వూహించి నవ్వుకున్నాను.

"అయినా యీ ప్రశ్న మిమ్మల్ని అడక్కూడదేమోలెండి. ఇంతకీ

షైమెంతయిందో అంటూ అటూ యిటూ చూశాడు అవధానిగారు. నా చేతిగడియారం కేసి చూశాడు. నా రిస్టువాచిమీద కుడిచెయ్యి ఆనించి వుంది.

"నా వాచి నిలిచిపోయిందండీ" అంటూ మూలనున్న కుటుంబరావు కేసి చూపించాను.

"ఏమండీ, టైమెంతయిందండీ?" అన్నాడు అవధానిగారు, కుటుంబరావుకేసి తిరిగి. అతను వెనక్కి తిరగకుండానే తన చేతిని బైటికి తీసి, వాచీని ప్రదర్శించాడు. నాలుగు దాటింది. "నా మతిమరపూ నేనూ భలేవాడినే. నా కోటుజేబులో పాకెట్‌వాచీ వుండనేవుంది సుమండి" అంటూ అవధానిగారు జేబులో గడియారంతీసి 'కీ' యిస్తున్నాడు.

"మతిమరుపు అయ్యవార్ని గురించి మరో కథ వుందండోయ్. ఇద్దరు స్నేహితులు మూడో స్నేహితుణ్ణి రైలెక్కించడానికి స్టేషన్ కెళ్ళారట. తీరా రైలు కదిలింతర్వాత అసలు వెళ్ళవలసినాయన ప్లాట్ ఫారమ్ మైననే దిగబడిపోయాడట. ఇంకా యిక్కడే వున్నారేం అని స్టేషన్‌మాష్టా రడిగాడట. "వచ్చే రైల్లో నా స్నేహితులిద్దరు దిగుతున్నారు, వారికి స్వాగతం చెప్పడానికొచ్చాలెండి" అన్నాడుట."

అందరూ నవ్వారు. శేషమ్మ కూడా భుజాలు ఎగురవేసుకుంటూ నవ్వింది. రైలు నిలిచింది తెనాలి స్టేషన్. అవధానిగారు సెలవు తీసుకుని దిగాడు. చిల్లర సామాన్లన్నీ పోగుచేసి అవతలికి అందిచ్చాను. కుటుంబరావు తన బాగ్ తీసుకొని ఎవ్వరికేసి చూడకుండా దిగాడు. పెట్టెముందు నిలబడ్డాడు. అటూ యిటూ చూశాడు. పదడుగులు ముందుకి నడిచాడు. వెనక పెట్టెలోంచి చంటిపిల్ల నెత్తుకొని నడుస్తూ వచ్చింది ఒకావిడ. ఆమె ముందువున్న బెడ్డింగ్ తీసుకొని కుటుంబరావు, ఆమె గేటువైపు నడిచి పోతున్నారు. గేటుదగ్గర జనం గుంపుగా నిలబడి ఒక్కొక్కరే టిక్కెట్ యిచ్చి లోపలికెడుతున్నారు. రాయన్న ఫ్లాస్కు తీసుకొని కాఫీ తీసుకొస్తానని వెళ్ళాడు. గేటుదగ్గర గుంపు పలచబడింది. ఆ గుంపులోగుండా

రాయన్న వెళ్ళాడు. సోడావాళ్ళు, టీ వాళ్ళు నా పెట్టెముందు పోగయ్యారు. జనం లోపలి కెక్కుతున్నారు. వారికి చోటివ్వడం కోసం లోపలికొచ్చాను. కూలీలు పెట్టెలోంచి దిగారు. మళ్ళా తలుపుదగ్గరకు వెళ్ళి గేటుదగ్గర జనం కేసి చూస్తూ నిలబడ్డాను. రాయన్న హోటల్లోంచి బయటకొచ్చి, గేటు దగ్గర గుంపులో ఆగాడు. గంటకొట్టారు. గార్డు విజిల్ వేశాడు. జనం అటూ యిటూ పరుగెడుతున్నారు. తలుపుదగ్గర నిలబడి ప్లాట్‌ఫారం పరకా యిస్తున్నాను. అప్పుడు కుటుంబరావు పిల్లనెత్తుకొన్న స్త్రీ వెనక్కి తిరిగి నాకేసి చూసారు. వెనక్కి నాకేసి చూస్తూ ముందుకు నడిచిపోతున్నారు. కుటుంబరావు పిల్ల నెత్తుకున్నాడు. ఆ పిల్ల చెయ్యి పైకెత్తి 'పో, పో' అన్నట్లు ఆడిస్తోంది. కుటుంబరావు నాకేసి చూస్తూ నవ్వినట్లు స్ఫురించింది. ఆమె పెదవులమీద కూడా చిరునవ్వు లాంటిది కనబడింది. రైలు కదులు తోంది. కుటుంబరావు నావైపు చూస్తూ ముందుకి నడుస్తున్నాడు. ఆ నవ్వు, ఆ చూపు నా అంతరంగికంపై వెక్కిరింపు వ్యాఖ్యానంలా భీకరంగా కన బడింది. పరుగెత్తుకొంటూ వచ్చి రాయన్న ఫ్లాస్కు నా చేతి కందించాడు. నా చూపుగుండా గేటుకేసి చూస్తున్నాడు రాయన్న.

"నా చెల్లెలు, దాని మొగుడండి. ఆర్మీలో చేరాడులెండి. కనకయ్య శెలవుమీదొచ్చి, స్నేహితుల్ని చూడాలని రెండురోజులుండి గూడూరులో ఎక్కాడండి.... మళ్ళా వస్తాలెండి బెజవాడలో...." అంటూ రాయన్న తన పెట్టెలో కెక్కాడు. నిజంగా రెండో తరగతి పెట్టెలో ప్రజాస్వామ్యం తన స్వరూపాన్ని అద్దంలో మాదిరి చూసుకోవడమే కాకుండా, తన తత్వానికి వ్యాఖ్యానాన్ని కూడా సమకూరుస్తుంది. ★